ప్రజా పాలన సేవా కేంద్రంను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

ఎల్లారెడ్డి, మార్చి 12: జీరో కరెంట్ బిల్లు కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు జీరో బిల్ రాక సమస్య ఏర్పడటంతో అధికారులు, మున్సిపల్ ఆఫీస్‌లో సేవా కేంద్రం ఏర్పాటు చేశారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సమస్యలను వెంటనే ఆన్‌లైన్‌లో సరిదిద్ది ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



టార్గెట్ బీఆర్ఎస్



- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ గాలం
- కామారెడ్డి మున్సిపాలిటీపై గురి
- బీఆర్ఎస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం
- ఇప్పటికే బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు, ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరిక
- పార్టీని వీడుతున్న ప్రజాప్రతినిధులు పలువురు ముఖ్యనేతలు
- బాన్సువాడలోనూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు
- వలసలను నివారించలేకపోతున్న బీఆర్ఎస్
- అయోమయంలో గులాబీ క్యాడర్

కామారెడ్డి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. మిగితా ప్రజాప్రతినిధులు, నాయకులను సైతం పార్టీలో చేర్చుకునేందుకు ఆ పార్టీ నేతలు ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి స్థానిక సంస్థల ఎన్నికల నాటికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులందరిని కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు పావులు కదుపుతున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. తాను గెలువడమే కాకుండా పార్టీకి కూడా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ బలంగా ఉండడంతో వాటిపై దృష్టి సారించిన నాయకులు కామారెడ్డి మున్సిపల్‌ను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే 23 మంది కౌన్సిలర్‌లను కాంగ్రెస్‌లో చేర్చుకుంది. చివరకు బీఆర్ఎస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నోటీసులు జారీ చేశారు. కామారెడ్డిలోనే కాకుండా బాన్సువాడ మున్సిపాలిటీపై సైతం దృష్టి సారించారు. ఆ మున్సిపాలిటీలోను పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. మున్సిపాలిటీలోనే కాకుండా సహకార సంఘాలు, మార్కెట్ కమిటీలు, మాజీ సర్పంచ్‌లకు కాంగ్రెస్ గాలం వేస్తోంది.

రోజురోజుకూ తగ్గుతున్న బీఆర్ఎస్ బలం

మలిదశ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న కామారెడ్డి జిల్లాలో పరిస్థితులు రోజురోజుకూ మారిపోతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ ఓడిపోవడంతో చాలా మంది నేతలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో వలసలు జోరందుకున్నాయి. ప్రధానంగా జిల్లాలో కారు ఖాళీ అవుతోంది. కారు దిగుతున్న నేతలు కాంగ్రెస్, బీజేపీ గూటికి చేరుతున్నారు. ఇటీవల కాలంలో కామారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీల్లోని పలువురు కౌన్సిలర్‌లు, సీనియర్ నాయకులు పార్టీని వీడుతూ కాంగ్రెస్‌లో చేరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాలనే ఆరాటంతో ఉన్న వారు బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు సీనియర్ లీడర్లు పార్టీని వీడుతున్నప్పటికీ ఆ పార్టీ నాయకత్వం నిల్వరించలేకపోతోంది. దీంతో గులాబీ శ్రేణుల్లో అయోమయం నెలకొంటుంది. బీఆర్ఎస్ బలం సైతం తగ్గుతోంది.

బీఆర్ఎస్ నుంచి జోరుగా వలసలు

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో వలసలు జోరందుకున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తలు వరుసగా కాంగ్రెస్‌లోకి క్యూ కడుతున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్సే రెండు సార్లు విజయం సాధించింది. అయితే రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఎలాగైన జహీరాబాద్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పట్టుదలతో ఉంది. దీంతో బీఆర్ఎస్ నుంచి వలసలను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌ను బలహీన పరచడంతో పాటు తన పార్టీ బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోం ది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో 23 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లో చేరారు. దోమకొండ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ గాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఇందుప్రియ, భిక్కనూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భూమయ్యతో పాటు మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, రాజంపేట మండలాలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బాన్సువాడకు కంచుకోటైన పోచారం ఇలకాలోనూ ఒకే సారి నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు పలువురు ముఖ్యనేతలు సైతం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలోనూ లింగంపేట జడ్పీటీసీ శ్రీలత, ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి, గాంధారి, తాడ్వాయి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. జుక్కల్‌లోనూ బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇలా జిల్లాలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు ఒక్కొక్కరు పార్టీని వీడుతుండడంతో బీఆర్ఎస్ క్యాడర్ అయోమయానికి గురవుతోంది.

కామారెడ్డి మున్సిపల్‌పై గురి

కామారెడ్డి మున్సిపాలిటీపై కాంగ్రెస్ గురి పెట్టింది. 2014 మున్సిపల్ ఎన్నికల్లో చైర్‌పర్సన్ పదవిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఆ సమయంలో బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌కు చెందిన మున్సిపల్ చైర్ పర్సన్‌తో పాటు పలువురు కౌన్సిలర్‌లు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో మున్సిపల్ బీఆర్ఎస్ వశమైంది. అయితే ప్రస్తుతం రాజకీయ పరిణామాలు వేగంగా మారాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్‌పై రివెంజ్ తీసుకునేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా కామారెడ్డి మున్సిపాలిటీపై కాంగ్రెస్ గురి పెట్టింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. బీఆర్ఎస్‌కు చెందిన 23 మంది కౌన్సిలర్‌లను పార్టీలో చేర్చుకుంది. చివరకు బీఆర్ఎస్ చైర్మన్‌పై కాంగ్రెస్ కౌన్సిలర్‌లు అవిశ్వాస నోటీసులను జారీ చేశారు. చైర్‌పర్సన్ పదవిని దక్కించుకునేందుకు కాంగ్రెస్ కౌన్సిలర్‌లు క్యాంపునకు తరలివెళ్లారు. ఎలాగైన అవిశ్వాసాన్ని నెగ్గి చైర్‌పర్సన్ సీటును కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ కసితో ఉంది. అవిశ్వాసం నెగ్గుతారా లేదా త్వరలో తేలనుంది.



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

కామారెడ్డి టౌన్, మార్చి 12: ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో డీఈవో, ఎంఈవో, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, నోడల్ అధికారులతో ఆయన మాట్లాడారు. కొందరు ఉపాధ్యాయులు ప్రైవేట్ దందాలకు పాల్పడుతున్నారని పాఠశాల సమయంలో ఎట్టి పరిస్థితుల్లో పాఠశాలలోనే ఉండాలని విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడవద్దని తెలిపారు. సంఘాల పేర్లు చెబుతూ ఏఏ ఉపాధ్యాయుడు ఏఏ దందాలు చేస్తున్నారో తన దృష్టిలో ఉందని వారు తమ తీరును మార్చుకోవాలని సూచించారు. తాను పాఠశాలలను పరిశీలన చేసినప్పుడు సదరు ఉపాధ్యాయులు మరోమారు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకునేలా పైఅధికారులకు ఆదేశిస్తానని తెలిపారు. ఉపాధ్యాయులు విధులకు హాజరు కాకుండా ఉంటే విద్యాశాఖాధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరించడం తగదని శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈవో రాజు, ఎంఈవో ఎల్లయ్య, ఆయా కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వన్ నేషన్ వన్ ప్రొడక్ట్ కార్యక్రమం మంచి ఆలోచన

భారతీయ రైల్వే ఆధునికీకరణ కార్యక్రమంలో భాగంగా వన్ రైల్వేస్టేషన్ - వన్ ప్రొడక్ట్‌లకు రూ.85వేల కోట్లపైగా విలువైన రైల్వే ప్రాజెక్ట్‌లకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పాల్గొని మాట్లాడారు. వన్ నేషన్ - వన్ ప్రొడక్ట్ మంచి ఆలోచన అని ఆయన అన్నారు. ఎయిర్ పోర్ట్‌లతో సమానంగా రైల్వే వ్యవస్థ అభివృద్ధి చెందు తుందని, వందే భారత్ లాంటి రైల్ వల్ల ప్రయాణం కూడా తొందరగా జరుగుతుందని అన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, మార్చి 12: భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పార్లమెంట్ ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హౌస్ ఆఫ్ పార్లమెంట్‌కు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అధికారులతో మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన వెంటనే ఎన్నికల నియమావళిని జిల్లాలో అమలు చేయాలని, దానికి తగిన విధంగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన మేర పోలింగ్ సిబ్బందిని సన్నద్ధం చేసుకో వాలని, ఇటీవల జరిగిన బదిలీల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో పాల్గొనే వివిధ బృందాల్లోని సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించేలా కార్యాచరణ రూపొందించాలని, ఈవీఎం యంత్రాల మొదటిస్థాయి చెకింగ్ నివేదికలు సమర్పించాలని, 85 సంవత్సరాలపై వయస్సు గల ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనే ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ పోలింగ్ కేంద్రం పరిధిలో దివ్యాంగులను మ్యాపింగ్ చేసే పోలింగ్ నాడు వారికి అవసరమైన రవాణా సదుపాయాలను కల్పించాలని, నామినేషన్ దాఖలు ఏర్పాట్లు పక్కాగా చేసుకోవాలని అన్నారు. జిల్లాలోని అన్ని ప్రింటింగ్ ప్రెస్‌లపై పూర్తిస్థాయి కంట్రోల్ ఉండాలని, ఎన్నికల ప్రచారాన్ని వ్యక్త పరిచే ప్రతీఫ్లెక్సీ, కర పత్రాలు ప్రచురణకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని అన్నారు. ఎన్నికల నిర్వహణపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే అపోహలను నివృత్తి చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో వచ్చే మార్పులపై ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తూ వారికి సమాచారం అందించాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా పెండింగ్ దరఖాస్తులను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను త్వరగా పరిష్కరించాలని సూచిం చారు. 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల నూతన ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని తెలిపారు.

పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి

పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు సూచించారు. మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్, కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షల నిర్వహణ సాగుతుందని తెలిపారు. జిల్లాలో 11,962 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ఇందుకోసం 62 కేంద్రాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వంద శాతం డ్యూయల్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష హాల్‌లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని తెలిపారు. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, పోలీసుబందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు.

రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్	సహర్
సా.6.31	ఉ.5.03



సహనం కలవారికి అల్లాహ్ ఎల్లప్పుడు తోడుగా ఉంటాడు. వారిని ఎల్లవేళలా రక్షిస్తాడు.



సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డిలో ఘనంగా సేవాలాల్ జయంతి

తండాల్లో సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి, మార్చి 12: అందరూ భక్తి మార్గంలో నడవాలని లంబాడాలకు సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గం ఆదర్శం, స్ఫూర్తిదాయకం అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. మంగళవారం ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి బోగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీలను ఐక్యం చేయడం సేవాలాల్ చేసిన కృషి ఎంతో గొప్పదని సంచార జీవనానికి స్వస్తి పలికేలా తండాలను నివాసాలుగా ఏర్పాటు చేసుకుని బానిస బతుకులకు విముక్తి కల్పించిన మహానేత సేవాలాల్ అని కొనియాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తి మార్గంలో నడవాలని అన్నారు. నియోజకవర్గంలో ఉన్న తండాలలో సీసీ రోడ్లు, మురికి కాలువలు, తాగునీరు, రోడ్లు విద్యుత్ సమస్యలు ఉంటే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో మురుగుదొడ్ల నిర్మాణానికి 9లక్షల 90వేల నిధులు మంజూరు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అన్ని వర్గాల వారికి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఇందులో ఆర్డీవో మన్నె ప్రభాకర్, జిల్లా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు బద్యానాయక్, బంజారా సంఘం అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అడవిలో మూడు ముక్కలాట

- బాన్సువాడ శివారులో జోరుగా పేకాట
- కాలువలు, చెరువులు, అటవీ ప్రాంతాలే ప్రధాన కేంద్రాలు
- పోలీసు సిబ్బందే ఇన్‌ఫార్మర్లు
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు

బాన్సువాడ, మార్చి 12: బాన్సువాడ డివిజన్ పరిధిలోని వివిధ స్థావరాల్లో పేకాట స్థావరాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. నిజాంసాగర్, పిట్లం, జుక్కల్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, మద్నూర్, బాన్సువాడ, బీర్కూర్, నసురుల్లాబాద్ పోలీసు స్టేషన్‌ల పరిధిలోని అటవీ ప్రాంతాల్లోని చెరువు గట్లు, కాలువ గట్లను కేంద్రాలుగా చేసుకుని పేకాట రాయుళ్లు నిత్యం మూడుముక్కలాటలో మునిగి తేలుతున్నారన్న ఆరోపనలు వస్తున్నాయి.

కాలువలు, చెరువులు, అటవీ ప్రాంతాలే ప్రధాన కేంద్రాలు

బాన్సువాడ ప్రాంతంలోని 10వ నెంబర్ కెనాల్, బోర్లం పెద్ద కెనాల్, దేశాయిపేట సింగరాయకొండ గట్టు ప్రాంతాలే కాకుండా బొల్లక్‌పల్లి, మద్యల్‌చెరు, పిట్లం, నసురుల్లాబాద్, బీర్కూర్ అటవీ ప్రాంతాల్లోని కంపలగండి, ఇబ్రహీంపేట్ శివారులోని కెనాల్ పక్కన తండాల్లో యువత ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు మూడు ముక్కలకే పరిమితమవుతున్నారన్న ఆరోపనలు ఉన్నాయి.

పోలీసు సిబ్బందే ఇన్‌ఫార్మర్లు?

బాన్సువాడ డివిజన్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధులో జరుగుతున్న మూడుముక్కలాట జోరుగా సాగుతున్నప్పటికీ పోలీసుల నిఘా కరువైందా? లేక సిబ్బందే ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తు, ముందస్తు సవ మా చారం చేరవేస్తున్నారా? అన్న ఆరోణలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసు బాస్‌లు స్పందించి మూడు ముక్కలాట కేంద్రాలపై దాడులు నిర్వహించి అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ఛిద్రమవుతున్న సామాన్యుల కుటుంబాలు

బాన్సువాడ డివిజన్ పరిధిలోని బాన్సువాడ, బీర్కుర్, నసురుల్లాబాద్, పిట్లం, మద్నూర్, జుక్కల్. పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, నిజాంసాగర్, పోలీసు స్టేషన్‌ల పరిధిలోని కేవలం సామాన్య ప్రజలు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల యువకులు మాత్రమే ఇటువంటి వ్యసనాలకు బానిసలవుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు కేవలం వారివారి విధులను నామ మాత్రంగా చేసుకుంటు వేతనాలు పొందడమే తప్పా సామాన్యులకు అవగాన కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా పోలీసు బాస్‌లు వివిధ గ్రామాల్లో అవగాహన కల్పించి ప్రజలను సమాయత్తం చేయాలని పలువురు కోరుతున్నారు.

పెట్రేగిపోతున్న దొంగలు

- బాన్సువాడ డివిజన్‌లో చెలరేగిపోతున్న దొంగలు
- తాజాగా బోర్లంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీ

బాన్సువాడ, మార్చి 12: బాన్సువాడ డివిజన్ పరిధిలో దొంగల బీభత్సం నానాటికి పెట్రేగిపోతోంది. ఓ చోట తాళం వేసిన ఇళ్లు, మరోచోట పట్టపగలే మహిళలను నిర్బంధించి చోరీలు చేయటం, చివరాఖరకు ప్రమాదకరమని తెలిసినప్పటికీ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌లలోని కాపర్ వైర్లను సైతం సునాయాసంగా దొంగిలిస్తున్నారు. ఒక్కొక్క ట్రాన్స్‌పార్మర్ విలువ లక్షల్లో ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు. నేరాలను అరికట్టాల్సిన పోలీసులు దొంగలను పట్టుకోవడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం వారానికో చోరీ బాన్సువాడ ప్రాంతంలో జరుగడం పరిపాటిగా మారింది.

పోలీసుల గస్తీ లోపంతోనే చోరీలు

బాన్సువాడ డివిజన్ పరిధిలోని పలు పోలీసుస్టేషన్‌ల పరిధిలో చోరీలు జరుగడం పరిపాటిగా మారింది. డివిజన్ పరిధిలోని జుక్కల్, బిచ్కుంద, పిట్లం, నిజాంసాగర్, బాన్సువాడ, బీర్కూర్, నసురుల్లాబాద్ పోలీస్ స్టేషన్‌లలో సిబ్బంది కేవలం నామమాత్రంగా విధులు నిర్వహిస్తూ వచ్చిన ఫిర్యాదుదారులను సఖ్యత పేరుతో మధ్యవర్తిత్వం చేస్తున్నారే తప్పా కనీసం గస్తీ నిర్వహించడం లేదన్న ఆరోపనలు ఉన్నాయి.

పోలీసు బాస్‌ల పర్యవేక్షణ కరువు

బాన్సువాడ డివిజన్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో ఏం జరుగుతుందోనన్న కనీస అవగాహన పోలీసు బాస్‌లకు లేకపోవటంతో ఇటువంటి చోరీలు షరా మామూలుగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల బాన్సువాడ డివిజన్ పరిధిలోని పిట్లం, నిజాంసాగర్ స్టేషన్‌ల పరిధిలో ట్రాన్స్‌పార్మర్ చోరీ జరుగగా సుమారు 15 రోజులు గడవక ముందే ఇటువంటి సంఘటన బాన్సువాడ ప్రాంతంలోని బోర్లం గ్రామంలో చోటు చేసుకోవటం పట్ల పోలీసు బాస్‌లు ఎంతమేరకు పర్యవేక్షణ చేస్తున్నారన్న విశయంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



బోర్లం శివారులో ట్రాన్స్‌పార్మర్‌ను పగులగొట్టి కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లిన దొంగలు

స్పందించని అధికారులు

బాన్సువాడ డివిజన్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలోని ఇటువంటి సంఘటనలు నిరంతరం చోటు చేసుకుంటున్నప్పటికీ పోలీసు అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి చోరీలు నివారిస్తాం

సత్యనారాయణ, డీఎస్పీ బాన్సువాడ

ట్రాన్స్‌పార్మర్‌ల చోరీలతో పాటు వివిధ రకాల నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. సాధ్యమైనంత త్వరలో ట్రాన్స్‌పార్మర్‌ల దొంగలను పట్టుకుని చట్టపరంగా శిక్షిస్తాం. ప్రజలు ఏ మాత్రం అధైర్య పడాల్సిన అవసరం లేదు. రాత్రి వేళల్లో ప్రతీ గ్రామంలో పెట్రోలింగ్ ముమ్మరం చేసి శాంతి భద్రతలను కాపాడతాం.

పోలీసులమని నమ్మించి దోచుకెళ్లిన దుండగులు

● మూడున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు ● నవీపేటలో ఘటన

నవీపేట,మార్చి12: మండల కేంద్రంలోని పాత పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం పోలీసులమని చెప్పి సినీ ఫక్కీలో వ్యక్తి నుంచి మూడున్నర తులాల బంగారు ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడు నర్సింహా చారి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. నర్సింహా చారి గతంలో ట్రాన్స్‌కో లైన్‌మన్‌గా పని చేసి రిటైర్డ్ అయి నవీపేటలోని లింగమయ్య గుట్ట కాలనీలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం సుమారు 10:15గంటల సమయంలో తన స్కూటీపై నవీపేటలోకి కంటి దవాఖానాకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. పాత పెట్రోల్ బంక్ సమీపంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అతనిని అటకాయించారు. తాము పోలీసులమని, ముందు పెద్దసార్లు వాహనాలు తనిఖీ చేస్తున్నారని వెంటనే తన ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను స్కూటీలో పెట్టుకోవాలని పురమాయించారు. దీంతో మెడలో ఉన్న తులంన్నర బంగారు గొలుసు, చేతి వేళ్లకు తులం బరువు ఉన్న రెండు బంగారు ఉంగరాలను కాగితంలో చుట్టచుట్టి స్కూటీలోని డిక్కీలో పెడుతున్నట్లు నటించారు. నిజమైన బంగారు ఆభరణాలను వారు తమ జేబులో వేసుకుని తమ జేబులో ఉన్న ఐదు రోల్డ్‌గోల్డ్ ఉంగరాలు గల కాగితం చుట్టను స్కూటీ డిక్కీలో ఉంచారు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత అనుమానం వచ్చిన అతుడు డిక్కీ తెరిచి చూడగా.. అందులో ఐదు రోల్డ్‌గోల్డ్ ఉంగరాలు కనిపించడంతో అవాక్కయ్యాడు. వెంటనే ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు యువకులను గుర్తించారు. ఈ మేరకు బాధితుడు నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండగులను పట్టుకోవడానికి నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్, ఎస్ఐ యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో గాలింపు చేపట్టారు.



బైక్‌పై పారిపోతున్న దుండగులు



దోమకొండలో బాలుర పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న దృశ్యం

పాఠశాలలను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

దోమకొండ, మార్చి 12: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల, పలుగడ్డ, శివరాంమందిర్ పాఠశాలతో పాటు మరో రెండు పాఠశాలలను మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు కావాలసిన వసతులు, తరగతి గదుల నిర్మాణం పనులు గుర్తించామన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా వాటి పనులు చేపట్టుటకు ప్రభుత్వానికి నివేదికను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, డీసీసీ జనరల్ సెక్రెటరీ తాటిపల్లి శ్రీకాంత్, అబ్రబోయిన స్వామి, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16 నుంచి మల్లికార్జునస్వామి ఉత్సవాలు

దోమకొండ, మార్చి 12: మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమం 16 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. 16న శనివారం సాయంత్రం 5 గంటలకు గంగ బోనం, 17న ఆదివారం రాత్రి మంద గంపలతో ఊరేగింపు, 18న సోమవారం శ్రీ మల్లన్నస్వామి, గొల్ల కేతమ్మ మేడలమ్మల కల్యాణం, రేణుకా ఎల్లమ్మ మునిరాజుల కల్యాణం మధ్యాహ్నం అన్నదానం అనంతరం అగ్ని గుండాల కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నేతుల నాగరాజు యాదవ్, కట్ట లక్ష్మణ్‌యాదవ్, సిరబోయిన ప్రవీణ్‌యాదవ్, యాదవ్, గొర్ల రమేష్ యాదవ్, ఎల్లయ్య యాదవ్, రమేష్ యాదవ్, లింగం యాదవ్, పరశురాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు

● ఏడీఈ కిరణ్ చైతన్య

దోమకొండ, మార్చి 12: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా రేషన్‌కార్డు ఉండి 200లోపు యూనిట్ల విద్యుత్ వచ్చే వారు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఏడీఈ కిరణ్ చైతన్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి లబ్ధిదారులు తప్పకుండా ప్రజాపాలన దరఖాస్తు ఫారంను ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో చూపించి వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. మార్చిలో 200లోపు విద్యుత్ బిల్లు వచ్చిన వారు బిల్లు చెల్లించవలసిన అవసరం లేదన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద పూర్తి వివరాలను నమోదు చేయగానే ఓటీపీ వస్తుందని వచ్చిన ఓటీపీని అక్కడ ఉన్నటువంటి సిబ్బందికి తెలియజేస్తే సరిపోతుందన్నారు. వచ్చే బిల్లులో జీరో బిల్లుగా నమోదై వస్తుందని ఎవరూ కూడా ఆందోళన చేందవలసిన అవసరం లేదన్నారు.



డీసీవోకు తీర్మానం అందజేస్తున్న దృశ్యం

బస్వాపూర్ విండో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

● డీసీవోకు డైరెక్టర్ల అందజేత

భిక్కనూరు, మార్చి 12: మండలంలోని బస్వాపూర్ విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కిష్టాగౌడ్‌పై డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం విండో ఉపాధ్యక్షుడు మద్ది స్వామి, 11 మంది డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాసానికి తీర్మానం చేసి డీసీవో శ్రీనివాస్‌కు అందజేశారు. బీఆర్ఎస్‌లో ఉన్న డీసీసీబీ డైరెక్టర్‌గా కొనసాగుతున్న కిష్టాగౌడ్ ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టిన కాంగ్రెస్ డైరెక్టర్లతో ట్రిప్‌కు వెళ్లారు. ఈ మేరకు బస్వాపూర్ విండో డైరెక్టర్లు మాట్లాడుతూ కన్నతల్లిలాంటి పార్టీకి డీసీసీబీ డైరెక్టర్ కిష్టాగౌడ్ ద్రోహం చేసి కాంగ్రెస్ పార్టీ చెంతకు చేరడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో విండో డైరెక్టర్లు పాల్గొన్నారు.

లింగంపేటలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

లింగంపేట, మార్చి 12: మండల కేంద్రంలోని బస్టాండ్, బీసీ కాలనీ ప్రాంతాల్లో గత కొన్ని సంవత్సరాలుగా లో వోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాలతో మంగళవారం ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. లోవోల్టేజీతో టీవీలు, ఫ్రిజ్‌లు, కంప్యూటర్లు, మోటార్లు కాలిపోయి లక్షల్లో నష్టపోతున్నామని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించడంతో వారు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఫతియోద్దీన్, నయీం, భైరయ్య, సాయికుమార్, రామకృష్ణాగౌడ్, రాజులతో పాటు నాయకులు ఉన్నారు.

నేడు వేస్ట్ ఫ్రమ్ బెస్ట్ అనే అంశంపై పోటీలు

కామారెడ్డి టౌన్, మార్చి 12: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని భవిత పాఠశాలలో ఉదయం 10 గంటలకు 'యూసేజ్ ఆఫ్ వేస్టేజ్' అనే అంశంలో 'వేస్ట్ ఫ్రమ్ బెస్ట్' అనే అంశంపై జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్‌అధికారి సిద్ధిరాంరెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని కోరారు.

దత్తత పేరిట పోచారం ఇసుక దోచేశారు

మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి



బీర్కూర్‌లో రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న నాయకులు

బీర్కూర్, మార్చి 12: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీర్కూర్‌ను దత్తత తీసుకుంటున్నానని చెప్పి మంజీరా నదిలో ఇసుక దోచేశారని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరికల కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ హాజరయ్యారు. ఆయన సమక్షంలో బీర్కూర్, కిష్టాపూర్, చించోల్లి గ్రామాలకు చెందిన ఐదు వందల మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మున్నూరుకాపులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రవీందర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం నెరవేర్చుతుందన్నారు. వంద రోజుల లోపే ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి పలువురు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరకుండా అడ్డుకోవాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోటగిరి మండలానికి చెందిన కొంత మంది నాయకులతో సమావేశమై మూడు నెలల్లో ప్రభుత్వం పడిపోతుందని పేర్కొన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే దమ్ము మీకు ఉందా అని ఆయన పోచారంను ప్రశ్నించారు. పది, పదిహేను ఏళ్ల వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని అన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు కొత్త నాటకానికి తెరలేపాడని, ఏం మొఖం పెట్టుకుని కాంగ్రెస్‌లోకి వస్తావని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లోకి వస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలే తరిమి తరిమి కొడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సానెపు గంగారాం, చందు, శంకర్, కాంత్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, ఇక్బాల్, విజయ, ప్రకాష్, యామ, రాములు, ప్రతాప్‌సింగ్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్ యాదవ్, స్వరూప, కమ్మ సత్యనారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎస్పీ

కామారెడ్డి టౌన్, మార్చి 12: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎస్పీ సింధూశర్మ అన్నారు. మంగళవారం ఇందిరా గాంధీ స్టేడియంలో డిస్ట్రిక్ పోలీసు అన్యూవల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనిఒత్తిడితో సతమతం అవుతూ కొద్దిగా ఉపశమనం,ఉల్లాసం కోసం ఈ క్రీడల్లో పాల్గొనడం మంచి పరిణామం అన్నారు. డీఎస్పీ స్థాయి నుంచి హోంగార్డుల వరకు పోటిలలో పాల్గొనడం అభినందనీయమని తెలిపారు.గెలుపోటములు సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని తెలిపారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో కబడ్డీ,వాలిబాల్, క్రికెట్, టగ్ ఆఫ్‌వార్, షాట్‌పుట్, షటిల్, బ్యాడ్మింటన్, 100 మీటర్ల పరుగు పందెం, 200 మీటర్ల పరుగు పందెం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ కాజోల్‌సింగ్, ఏఎస్పి కే.నరసింహరెడ్డి, డీఎస్పీలు నాగేశ్వర్‌రావు, శ్రీనివాసులు, సత్యనారాయణ, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ జార్జ్, తదితరులు పాల్గొన్నారు.



పోలీసు స్పోర్ట్స్‌మీట్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



సదాశివనగర్, మార్చి 12: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా చొరవచూపాలని ట్రైని ఐపీఎస్ సదాశివనగర్ ఇన్‌చార్జీ ఎస్‌హెచ్‌వో కాజల్ అన్నారు. మండలంలోని మర్కల్ జంక్షన్ వద్ద పరిసరాలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డుకిఇరువైపులా నిర్వహిస్తున్న హోటల్ నిర్వహకులు వాహనాలు రోడ్డుపై నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రజలు రోడ్డు దాటేటప్పుడు గమనిస్తు రోడ్డు దాటాలని హోటల్ నిర్వాహకులు కూడా అటువంటి సందర్భాలను పసికట్టి తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.రోడ్డు నిబంధనలు ఎవరూ పాటించకపోయిన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో ఎస్ఐ రాజు,సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రైనీ ఐపీఎస్ కాజల్

'పర్మిషన్ లేకుండా అడ్మిషన్‌లు చేస్తున్న పాఠశాల యాజమాన్యం'

కామారెడ్డి టౌన్, మార్చి 12: కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎలాంటి పర్మిషన్ లేకుండా నారాయణ పాఠశాల యాజమాన్యం అడ్మిషన్‌లు మొదలుపెట్టిందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చరణ్ అన్నారు. మంగళవారం పాఠశాలకు అనుమతి లేకుండా ఏ విధంగా అడ్మిషన్‌లు చేస్తున్న విద్యాశాఖ అధికారులు కనీస దృష్టిసారించడం లేదని అన్నారు. ఇప్పటికే 72 అడ్మిషన్‌లు చేయడం జరిగిందని తల్లిదండ్రులు కనీసం అనుమతులు లేని పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి వారి భవిష్యత్తును అంధకారం చేయవద్దని తెలిపారు. నారాయణ పాఠశాల యాజమాన్యం చేపడుతున్న చర్యలపైన ఎంఈవో ఎల్లయ్యకు తెలపడంతో అడ్మిషన్‌లు చేస్తున్న గదిని సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా హస్టల్ కన్వీనర్ ఖలీల్, జిల్లా ఖేల్ కన్వీనర్ రోహిత్, కార్యకర్తలు సంతోష్, అల్తాఫ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీవోస్ కాలనీలో యువతి అదృశ్యం



గాడి శృతి(ఫైల్)

కామారెడ్డి టౌన్, మార్చి 12: కామారెడ్డి పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో నివాసం ఉండే గాడి శృతి కనిపించకుండా పోయినట్లు పట్టణసీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం రెండుగంటల సమయంలో కళాశాలకు వెళ్లివస్తానని ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లుగా తెలిపారు. సాయంత్రమైన ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో వెతికి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

'ఉన్నత లక్ష్యం కోసం కృషి చేయాలి'

పెద్ద కొడప్‌గల్, మార్చి 12: పాఠశాలలో విద్యాభ్యాసం చేసే ప్రతీ విద్యార్థి తనకంటూ ఒక లక్ష్యాన్ని కలిగి ఉండి ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని మండల ఇన్‌చార్జి విద్యాధికారి దేవీసింగ్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండలంలోని వడ్లం గ్రామ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దేవీసింగ్ మాట్లాడుతూ చిన్న నాటి నుంచి విద్యతో పాటు ప్రతీ ఒక్క విద్యార్థి లక్ష్యం నిర్ణయించుకోవాలని ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని సూచించారు. దీంతో పాటుగానే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తమ పాఠశాలతో పాటు గ్రామానికి పేరు తీసుకరావాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్, ప్రధానోపాధ్యాయులు వల్లభరావ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో మాట్లాడుతున్న ఆకునూరి మురళీ

మనువాద దాడులను తిప్పికొట్టేలా ముందుకు రావాలి : ఆకునూరి మురళీ

భిక్కనూరు, మార్చి 12: మనువాద దాడులను తిప్పికొట్టేలా ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత ముందుకు రావాలని రిటైర్డ్ హైకోర్టు జస్టీస్ చంద్రకుమార్, రిటైర్ట్ ఐఏఎస్ ఆకునూరి మురళి అన్నారు. మంగళవారం భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో శాస్త్రీయ విధానంపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. చరిత్రలను వక్రీకరిస్తూ కేవలం మనువాద సంస్కృతిని పెంపొందించే విధంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ అడుగులు వేస్తుందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రజల మెదడులో విష సంస్కృతిని నింపుతున్నారని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కర్క గణేష్, రాష్ట్ర యూనివర్సిటీల జాతీయ కన్వీనర్ నాగేశ్వర్‌రావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రెహమాన్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రొఫెసర్ లక్ష్మీ, వినాయక్ రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'దేశాభివృద్ధికి మహిళలు వెన్నెముక'

కామారెడ్డి టౌన్, మార్చి 12: దేశాభివృద్ధికి మహిళలు వెన్నెముకలాంటివారని జిల్లా న్యాయాధికారి శ్రీదేవి అన్నారు. మంగళవారం మహిళా వారోత్సవాలలో భాగంగా కోర్టు సమీపంలో గత 20 ఏళ్లుగా చాయి దుకాణం నడుపుతూ నలుగురు సంతానాన్ని పెంచి పోషించిన శారద అనే మహిళను సన్మానించి బహుమతి అందించారు. ఒంటరిగా ఉంటూనే ఏమాత్రం ధైర్యాన్ని కోల్పోకుండా తన స్వశక్తితో కుటుంబ బాధ్యతలను సక్రమంగా ముందుకు సాగిస్తున్నందున ఆమెను అభినందించినట్లు తెలిపారు. మహిళ సాధికారతే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు కృషిచేయాలని తెలిపారు. ఇందు లో సంస్థ సూపరింటెండెంట్ వంచ చంద్రారెడ్డి, ఖాన్,శ్రావణ్, పోలీసు లైన్ అధికారలు విఠల్, హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.



రేణుకాచార్యుల దేవస్థానానికి పాదయాత్రగా వెళ్లిన భక్తులు

రేణుకాచార్య భక్తుల పాదయాత్ర

బిచ్కుంద, మార్చి 12: యాదాద్రి జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన కొలనుపాక రేణుకాచార్యుల దేవస్థానానికి భక్తులు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. గుడిమెట్ మహాదేవ మహరాజు ఆధ్వర్యంలో సోమవారం మహారాష్ట్రలోని దెగ్లూర్ నుంచి కొలనుపాక రేణుకాచార్యులు దేవస్థానానికి పాదయాత్రగా దిండి బయలుదేరి రాత్రి మండలంలోని కందర్‌పల్లి సిద్ధేశ్వర దేవస్థానం వద్ద బస చేశారు. మంగళవారం కందర్‌పల్లి నుంచి పాదయాత్రగా దిండి బయలుదేరి బిచ్కుంద మీదుగా పెద్ద దేవాడలో పాదయాత్ర భక్తులకు గ్రామస్థులు అల్పాహారం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం పాదయాత్ర భక్తులకు వాజిద్‌నగర్ గ్రామంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి బాన్సువాడ బోర్లం బసవన్న దేవాలయం వద్ద రాత్రి బస చేస్తున్నట్లు మహదేవ్ మహరాజు వివరించారు. 300కి.మీ. దూరంలో గల కొలనుపాక రేణుకాచారి దేవస్థానానికి చేరుకోవడానికి పది రోజులలో చేరుకుని స్వయంభుగా వెలిసిన రేణుకాచార్యులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. పది రోజుల పాటు పాదయాత్రలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించడం జరిగిందన్నారు. తిరిగి భక్తులను ఇంటికి చేర్చుతామన్నారు. బిచ్కుందలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పాల్గొని మహదేవ్ మహరాజ్ ఆశీస్సులు పొంది నగదును అందజేశారు.

కాల భైరవస్వామికి ప్రత్యేక పూజలు



స్వామి వారికి పూజలు నిర్వహించిన దృశ్యం

రామారెడ్డి, మార్చి 12: రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన కాలభైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య భైరవుడికి పాలాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజా కార్యక్రమాలను అంగరంగవైభవంగా నిర్వహించారు. రూ.6,616 దండాను స్వామివారి మెడలో వేశారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ సిబ్బంది సురేందర్ గుప్తా, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బంజారా నాయకులు

ఎల్లారెడ్డికి తరలిన బంజారా నాయకులు

గాంధారి, మార్చి 12: గిరిజనులకు ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం మంగళవారం నిర్వహించడంతో ఎల్లారెడ్డిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు గాంధారి మండలంలోని అన్ని తండాల నుంచి గిరిజన నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావును మండలంలోని అన్ని తండాల నాయకులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలని పేర్కొన్నారు. చదువుతూ పాటు ఆటల్లో కూడా ముందుకు సాగాలని విద్యతోనే భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇక్కడ ఉన్నారంటే చదువుతునే ఏదైన సాధించవచ్చునని పేర్కొన్నారు. మొదటిసారి గండివేటు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేల పరమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీల్లో అధికారుల తనిఖీలు

కామారెడ్డి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మంజీరా నది పరివాహక ప్రాంత ంలోని బీర్కూర్‌లో ఇసుక క్వారీలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఐదేళ్లం తెలిసిందే. ఈ క్వారీలను ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు స్టాక్ పాయింట్లు గా విభజించి కాంట్రాక్టర్లకు ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. గత ఐదేళ్లుగా ఈ ఇసుక క్వారీలలో భారీగా అక్రమాలు జరిగాయని కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులను రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే ఒకటి, రెండు, మూడు స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు ఉండడంతో ఆ నిల్వలు ఎంతమేర ఉన్నాయి, ఎంతమేర తరలించారు అనేదానిపై తనిఖీలు చేపట్టాలని రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ డీజీ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సంగారెడ్డి జిల్లాలోని అర్సిపురం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ మలినేని శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో విజిలెన్స్ ఆఫీసర్ హరికృష్ణ, ఎస్ఐ మహేష్, జిల్లా మైనింగ్ ఆర్ఐ నాగరాజుల బృందం ఆధ్వర్యంలో బీర్కూర్‌లోని ఒకటి, రెండు, మూడు ఇసుక స్టాక్ పాయింట్లను తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్ల వద్ద ప్రస్తుత పరిస్థితులపై విజిలెన్స్ డీజీకి, ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నామని బృందం అధికారులు తెలిపారు. ఇసుక తవ్వకాలలో ఎటువ ంటి అలసత్వం వహించిన సంబంధిత అధికారులపై సిబ్బందిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా డీజీతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు.



తనిఖీలలో పాల్గొన్న అధికారులు

పొట్ట దశలో ఉన్న వరి పంటను రైతులు కాపాడుకోవాలి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మీ



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నసురుల్లాబాద్, మార్చి 12: మండల కేంద్రంలోని మండల రైతు వేదికలో రైతులకు మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ పొట్టదశలో ఉన్న వరి పంటను రైతులు కాపాడుకోవాలన్నారు. రైతులు ఎండాకాలంలో పంట పొలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ సదస్సులో జిల్లా ఏడీఏ వీరా స్వామి, మండల వ్యవసాయ అధికారి నరేంద్ర, ఏఈఓలు శ్రావణ్, మీనా, భాను, ప్రశాంత్, దత్తేశ్వరిలు, బాన్సువాడ డివిజన్‌లోని ఆయా మండలాల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండలంలోని సింగీతం, తదితర గ్రామాల శివారుల్లో జిల్లా వ్యవసాయాధికారిణి జె.భాగ్యలక్ష్మీ వరి, తదితర పంటలను పరిశీలించి, రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. వరి, ఆయా పంటల్లో తెగుళ్లు సోకితే వెంటనే రైతులు స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మధుసూదన్, ఆయిల్ ఫాం అధికారి హమీద్, రైతులు తదితరులున్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గామి
ప్రియా 70	- భీమా
ప్రియా 35	- ఆపరేషన్ వాలెంటైన్

బాన్సువాడ

మహేశ్వరి	- భీమా
వెంకటేశ్వర	- గామి

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

